క్లుప్తంగా

బీపీ మండల్‌కు ఘన నివాళి



సత్తెనపల్లి: బీసీల రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని ఎన్ జీఓ సెంటరులో బొంత సాంబశివరావు ఆధ్వర్యంలో శనివారం బిందేశ్వరి ప్రసాద్ మండల్ 43వ వర్ధంతి నిర్వహించారు. మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ బీసీల బతుకుల్లో వెలుగులు నింపిన కార్యదర్శకుడు బీపీ మండల్ పార్లమెంటు సభ్యుడిగా, సంఘ సంస్కర్త, రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారని వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గుంటూరు గోవిందు, కంటూ వెంకటరామయ్య, బి.కమలాకర్, కె.దస్తగిరి, వరికల్లు రామయ్య, గొట్టం వెంకటేష్, బాపట్ల అంకమ్మరావు, సాకి శ్రీనివాసరావు, పిక్కల రత్తయ్య, కె.ప్రసాద్, పల్లపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్ కోరారు. మండలంలోని నందిగామ, గుడిపూడి గ్రామాల్లో శనివారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ రాజేష్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏమాత్రం గొడవలు, ఘర్షణలకు పాల్పడినా భవిష్యత్తులో అనేక నష్టాలు ఉంటాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ సోమవారం నుంచి 28 రోజుల పాటు ఉచిత యోగ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగాచార్యులు కూనిశెట్టి వెంకట జనార్ధన గురూజీ శనివారం తెలిపారు. శ్రీ పట్టాభిరామస్వామి వారి దేవస్థానంలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగశిక్షణ ఇస్తామన్నారు.

బీపీ మండల్ వర్ధంతి

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీపీ మండల్ చేసిన సేవల గురించి ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట: ప్రతిభగల ఆర్యవైశ్య విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఆవోపా ఆధ్వర్యంలో బంగారు, వెండి పతకాలతో సత్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్టి శ్రీరాములు తెలిపారు. 2024లో పదో తరగతి, ఇంటర్, వివిధ రకాల ప్రవేశ పరీక్షలలో అత్యంత ప్రతిభకనబరిచిన విద్యార్థులకు పతకాలు అందిస్తామన్నారు. నీట్, జేఈఈ అడ్వాన్స్, ఏపీఈఏపీసెట్ వంటి ప్రవేశ పరీక్షలలో ప్రతిభకనపరిచిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో 95 శాతానికి పైగా సాధించిన విద్యార్థులు, ప్రవేశ పరీక్షల్లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను నింపి 9866698431 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. పతకాలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేయబడుతుందన్నారు. పతకాలు ఏ రోజు ఇచ్చేది, వేదిక తదితర వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నాదెండ్ల: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జె బలరామ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు తిమ్మాపురం గ్రామానికి చెందిన జోషి ప్రభుత్వ మద్యం దుకాణం నుండి కొనుగోలు చేసిన 15 క్వార్టర్ బాటిళ్లలో నాదెండ్ల నుంచి తిమ్మాపురం వెళ్తున్నాడు. మార్గమధ్యలో పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీ చేసి అతని వద్ద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చారిత్రాత్మకం 'మేమంతా సిద్ధం' యాత్ర



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



సమావేశానికి హజరైన నాయకులు, కార్యకర్తలు

- సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- ప్రజాబలం.. జగనన్నకే సాధ్యం
- ఈ నెల 24న నామినేషన్ వేస్తున్నా
- ప్రతీ ఒక్కరూ హజరై ఆశీర్వదించండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానం, తనపై ప్రేమతో చరిత్రలో నిలిచిపోయాలా ప్రజలు హాజరై మేమంతా సిద్ధం రోడ్ షోను జయప్రదం చేశారని, పేరుపేరునా వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మేమంతా సిద్ధం రోడ్ షో దిగ్విజయమైన సందర్భంగా ఆయన ధన్యవాద సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రజాబలం అంటే జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. ఆయనకున్న ప్రజాదరణ ప్రస్తుతం ఎవరికి లేదన్నారు. జగన్ రోడ్ షోకు జనం లేక వెలవెలా అని రాసిన ఈనాడు రామోజీకి బుద్ధి లేదని, ఇవి దుర్మార్గపు రాతలని మండిపడ్డారు. ఈ నెల 24న దేవరంపాడు నేతి వెంకన్న స్వామి వద్ద నామినేషన్ పత్రాలను పూజ చేయించి, ర్యాలీగా వచ్చి దాఖలు చేస్తానన్నారు. నామినేషన్‌కు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. విశ్వాస ఘాతకులను ఓడించి, విశ్వాస పాత్రులను గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు నియోజవర్గ ప్రజలతో మమేకమవుతున్నారన్నారు. అంబటి ఏ కార్యక్రమం చేసినా రాష్ట్రమంతా గమనిస్తోందన్నారు. అంబటిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పూర్వ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు మాట్లాడారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించిన ఈ సమావేశం లో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబురావు, షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, దొంతిరెడ్డి సునీతారెడ్డి, షేక్.మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, కళ్ళం విజయభాస్కరరెడ్డి, డాక్టర్ మక్కెన అచ్చయ్య, సంకటి శ్యాంసన్, షేక్ ఎలవర్తి పాటి ఇస్సా, ఎంజేఎం రామలింగారెడ్డి, గొలమారి వెంకట్రామి రెడ్డి, కోడిరెక్క దేవదాస్, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, లాల్‌బాషా, కట్టా సాంబయ్య, నల్లబోతు శివనా రాయణ, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో జోష్

- సీఎం జగన్ పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన
- విజయవంతం చేసిన మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్తెనపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో జోష్ పెంచింది. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అంబటి రాంబాబు రోడ్ షో విజయవంతం కావడంలో కీలకంగా వ్యవహరించారు.

ఈ నెల 10న నియోజకవర్గంలోని నకరికల్లు, నకరికల్లు అడ్డరోడ్డు, శ్రీరాంపురం, త్రిపురాపురం మీదుగా రాజుపాలెం మండలం శ్రీనివాసనగర్, నెమలిపురి, దేవరం పాడు క్రాస్, కొండమోడు, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం మీదుగా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల బస ప్రాంతానికి సీఎం జగన్ బస్సు యాత్ర సాగింది. 12న సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల, భాగ్య నగర్ కాలనీ, కంకణాలపల్లి అడ్డ రోడ్డు, ఎన్నాదేవి మీదుగా సత్తెనపల్లి పట్టణంలోకి చేరుకుంది. పట్టణంలోని మాచర్ల రోడ్‌లో గల చెక్‌పోస్ట్ సెంటర్, ఐదు లాంతర్ల సెంటర్, గడియార స్తంభం సెంటర్, తాలూకా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, ఆటోనగర్, గుంటూరు రోడ్డులోని పెద్ద కాలువ, పారిశ్రామిక వాడ, మురళి నగర్ మీదుగా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం, నందిగామ అడ్డరోడ్డు, కంటెపూడి మీదుగా తాడికొండ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పట్టణంలోని చెక్‌పోస్ట్ సెంటర్‌లో 12 క్రేన్‌లు, పెద్దకాలువ వద్ద మరో 12 క్రేన్‌లు ఏర్పాటు చేసి భారీ గజమాలలతో సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలో ఆరంభం నుంచి చివరి వరకు సీఎం రోడ్ షోకు జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. బస్సుపై నుంచి ప్రజలు, పార్టీ క్యాడర్‌కు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగారు. ప్రధాన రహదారులంతా జనంతో కిక్కిరిసిపోయాయి. కొండమోడు వద్ద జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబును పరిచయం చేశారు. 'రాంబాబు అన్నకు మీ సంపూర్ణ మద్దతు తెలియ చేయాలి'. అని సీఎం

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



డీ.అనూష పి.మాధవి అన్నం.కృప అంబటి బాలసుష్మ శివరాత్రి మీనాక్షి

సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని కేజీబీవీలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ ఇంటర్ బైపీసీలో 889 మార్కులతో డి.అనూష ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎం.ప్రసన్నరాణి తెలిపారు.

- రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల జూనియర్ ఇంటర్ విద్యార్థులు 79.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 442 మార్కులతో సి.ఝాన్సీ, బైపీసీలో 421 మార్కులతో పి.శరణ్య, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 922 మార్కులతో ఎం.నాగజ్యోతి, ఎం.పునీత, బైపీసీలో 922 మార్కులతో బి.శృతి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎస్.శైలజ తెలిపారు.
- పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 86 శాతం ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 459 మార్కులతో పి.మాధవి, 458 మార్కులతో ఎ.కృప, అంబటి బాల సుష్మ, బైపీసీలో 413 మార్కులతో శివరాత్రి మీనాక్షి, సీఈసీలో 421 మార్కులతో జి.స్వరూప, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 983 మార్కులతో షేక్ రీనా, 978 మార్కులతో షేక్ ప్యారిజాన్, బైపీసీలో 964 మార్కులతో షేక్ సుష్మ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాస రావు అభినందించారు.
- పట్టణంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 62 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 434 మార్కులతో పి.నికిత, సీఈసీలో 420 మార్కులతో బి.పూజిత, బైపీసీలో 383 మార్కులతో వి.నందిని, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 909 మార్కులతో షేక్ మెహబున్నీసా ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ కన్యాకుమారి తెలిపింది. కళాశాల డైరెక్టర్లు రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అభినందించారు.
- పట్టణంలోని వృంద జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 81.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 80.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ సీఈసీలో కె.సౌమ్యశ్రీభాయ్ 442 మార్కులతో ప్రతిభ చూపినట్లు కళాశాల డైరెక్టర్ అనూష గంగారపు తెలిపారు.
- పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 80 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 81.6 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ సీఈసీలో పూలా అభిలాష్ 949 మార్కులతో ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ రావిపాటి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ పరిటాల నరేష్ అభినందించారు.
- పట్టణంలోని వేదా జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 80.1 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 88.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. నర్సింగ్‌లో 478 మార్కులతో గుండాల మహేశ్వరి పల్నాడు జిల్లా టాపర్‌గా, 451 మార్కులతో బి.రిబ్కా జిల్లా ద్వితీయస్థాయిలో ప్రతిభ చూపినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ సైదా నాయక్ తెలిపారు. కళాశాల డైరెక్టర్ సూర్యప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

సత్తెనపల్లి: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి అగ్నిమాపకశాఖాధికారి ఎంవీ సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఏడాది వారోత్సవాలకు 'అగ్ని భద్రత నిర్ధారించండి.. దేశ నిర్మాణానికి సహకరించండి' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విపత్తు స్పందన అగ్నిమాపక అధికారి ఎస్.శ్రీధర్ ఆదేశాల జారీ చేసినట్లు చెప్పారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు అగ్ని ప్రమాదాలపై మరింత అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో లీడింగ్ ఫైర్ మెన్ ఆర్.హుస్సేన్, ఫైర్‌మెన్‌లు ఎం.మోహన్‌బాబు, ఎస్.రమణ నాయక్ పాల్గొన్నారు.

సిగరెట్ నిప్పంటుకుని మంటలు

సత్తనపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడం వల్ల పొలాల్లో మంటలు చెలరేగిన ఘటన మండలంలోని కొమెరపూడి వాటర్ ట్యాంక్ సమీపంలోని పొలాల్లో శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి నిప్పు ఆర్పకుండా పడేయడంతో పొలాల్లో మంటలు వ్యాపించాయి. అగ్నిమాప కేంద్రానికి సమాచార ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో వరి పొలాలకు నష్టం తప్పింది.

తాగునీటి అవసరాలకే వినియోగించాలి

ముప్పాళ్ల: నాగార్జున సాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని ఎన్ఎస్‌పీ ఏఈఈ సీహెచ్.చిన్నారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గుంటూరు బ్రాంచి కాలువ, పెదనందిపాడు బ్రాంచి కాలువ పరిధిలోని మంచినీటి చెరువులన్నింటినీ నింపాలని పేర్కొన్నారు. ప్రస్తుతం 1500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోందని, ఈ నెల 20వ తేదీ లోపు చెరువులను నింపుకోవాలని తెలిపారు. కాలువల ద్వారా ప్రవహించే నీటిని వ్యవసాయఅవసరాలకు వినియోగించరాదని, రైతులు సహకరించాలని పేర్కొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 95 ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జోతిర్మయి శనివారం తెలిపారు. 19 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 18 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 23 మందికి గాను 17 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ రాసే విద్యార్థులు ఈ నెల 18 నుంచి 24వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని వెల్లడించారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

ముప్పాళ్ల: మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హజరతయ్య శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల చిన్నపరెడ్డి గృహంలో మద్యం అమ్ముతున్నట్లుగా అందిన సమాచారం మేర తనిఖీలు చేసి, మద్యం సీసాలను గుర్తించామన్నారు. అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముప్పాళ్ల: వివాహిత అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హజరతయ్య శనివారం తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాగంటివారిపాలేనికి చెందిన ఉప్పు జ్యోతి అనే వివాహిత మహిళ క్రోసూరు మండలంలోని ఉయ్యందన గ్రామంలోని అత్తగారి ఇంటి నుంచి వారం క్రితం చాగంటివారిపాలెంలోని పుట్టింటికి వచ్చింది. ఈ నెల 10న 18 నెలల పాపతో అత్తగారింటికి వెళుతున్నట్లుగా చెప్పి కనిపించకుండా పోయిందని జ్యోతి తండ్రి దేవిశెట్టి వెంకటేశ్వర్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో నంబూరు వసంతకుమారి

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అన్ని వర్గాల మెప్పు పొందుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. శనివారం మండలంలోని యమ్మాజీగూడెం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. చంద్రాజుపాలెంలోని పార్టీ కార్యాలయంలో వారికి వసంత కుమారి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఓర్సు రాజు, బత్తుల సోమమ్మ, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, రమణబోయిన లోకయ్య, శివరాత్రి తిరుపతయ్య, శ్రీరామ ఆంజనేయులు, శ్రీపతి సునీల్ కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, ఎంపీగా అనీల్‌కుమార్‌యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, అన్నపరెడ్డి నర్సిరెడ్డి, సర్పంచ్ తురకా శ్రీను, నారుమళ్ల రామకోటి, వడ్డీకాసులు పాల్గొన్నారు.

పాము కాటుకు కూలీ మృతి

క్రోసూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో మిర్చి కోతల పనులకు వలస వచ్చిన కర్నూలు జిల్లాకు చెందిన వివాహిత బోయ కమలమ్మ(53) పాముకాటు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. వివరాల మేరకు.. మృతురాలు కర్నూలు జిల్లా పత్తి కొండ మండలం లోని అత్తకలగుండు గ్రామం నుంచి మండలంలోని అనంతవరం గ్రామంలో మిర్చి కోతల పనులకు వలస వచ్చింది. ఈ నెల 5న కూలి పనుల్లో ఉండగా పొలంలో పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న భర్త దుగ్గిరాజు తోటి కూలీల సాయంతో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి భర్తకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి వివాహాలైన ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్లలో చైతన్యం

నోడల్ ఆఫీసర్ పెదప్రోలు శంకర్‌రావు



రెంటచింతల గ్రామంలో ఓటర్లలో చైతన్యం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రెంటచింతల : గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవడానికి ఎన్నికల సంఘం ఓ ప్రత్యేక వాహనం ద్వారా చైతన్యం తీసుకు రావడానికి కృషి చేస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శనివారం రెంటచింతలలోని పలు కాలనీల్లోఆయన ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్ల చైతన్య కార్యక్రమాల్లోపాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక వాహనం ద్వారా అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని గ్రామాలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శి నాగులునాయక్, విఆర్వోలు టి.లింగయ్య, రేఖా, నాసరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు ట్యాంకర్లతో మంచినీటి సరఫరా



ట్యాంకర్ నుంచి మంచి నీటిని పట్టుకుంటున్న గోలి గ్రామస్తులు

రెంటచింతల : మండలంలోని గోలి, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలకు సత్రశాల పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, సీజీఎం జి.ధర్మారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఆయా గ్రామస్తులు మంచినీటి సమస్య కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నందున సత్రశాల పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చి మూడు గ్రామాలకు రెండు ట్యాంకర్ల సహాయంతో మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఆయా గ్రామాలలో పిల్లల విద్యాభివృద్ధికి చేయుతనివ్వడంతో పాటు పలు సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలను అందిస్తోందని చెప్పారు.

చెట్టుపై నుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

నకరికల్లు: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి విద్యుత్ లైన్ మెన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో శనివారం జరిగింది. వివరాల మేరకు.. చల్లగుండ్ల గ్రామంలో వరప్రసాద్ నాయక్ విద్యుత్ లైన్ మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధి నిర్వహణలో భాగంగా తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో పైనుంచి జారి పడిపోయాడు. తీవ్రగాయాలు కాగా నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని వితంరాజుపల్లి గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామం పాముల కాలనీకి చెందిన కామేశ్వరరావు ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

నేడు అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు

సత్తెనపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి కార్యక్రమాలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం, తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు జరుగుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల బాధ్యులు, కార్యకర్తలు హాజరు కావాలని పేర్కొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి

తహసీల్దారు రామ్మోహన్‌రావు



సత్రశాల వద చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన తహసీల్దార్ ఎస్. రామ్మోహన్‌రావు

రెంటచింతల : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తహసీల్దార్ ఎస్.రామ్ మోహన్‌రావు అన్నారు. శనివారం సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను, సత్రశాల వద్దనున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గతంలో జరిగిన ఎన్నికల సమయంలో ఏఏ పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయో ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో నున్న 11 గ్రామాలలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు సహకరించాలన్నారు. తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం, నగదు, విలువైన వస్తువులు సరఫరా నిలుపుదల చేయుటకు సత్రశాల వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దాసరి కాంతారావు, విఆర్వో కటికల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారికి బోనాల సమర్పణ

రెంటచింతల : స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు 16 రోజుల పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో శనివారం బోనాలను సమర్పించారు. మార్చి 28న స్వామివారి దేవస్థానం 20వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్వామివారి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. దేవస్థానం అధ్యక్షులు నాళం పెద్దబాబు, దేవస్థానం పాలక వర్గం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.